# ఇంటింటికీ ఓటర్ స్లిప్పులు అందిస్తాం

**కలెక్టర్ నారాయణరెడ్డి**

**వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబర్ 16 : బీఎల్‌వోల ద్వారా ఇంటింటికీ ఓటర్ స్లిప్పులు అందజేయనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ ప్రక్రియ, ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల బరిలో ఉన్న రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చులు తదితర అంశాలపై కలెక్టరేట్‌లోని తన చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 4 నియోజకవర్గాల ఓటర్ జాబితాలను సంబధిత రిటర్నింగ్ అధికారులకు పంపించడం జరిగిందన్నారు. 9,60,375 మందికి సంబంధించిన ఓటర్ స్లిప్పులను సిద్ధం చేసి బూత్ స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్ స్లిప్పుల్లో ఓటర్ వివరాలతో పాటు పోలింగ్ కేంద్రం లొకేషన్, ఓటు వేసే విధానంపై సమాచారం పొందుపరచడం జరిగిందన్నారు. ఓటర్ స్లిప్‌తో పాటు ఓటర్ గైడ్, సి-విజిల్ కరపత్రాన్ని కూడా ప్రతి ఇంటికి అందజేస్తున్నామన్నారు. డబ్బు, మద్యం పంపిణీ లేదా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లయితే ఫొటో తీసి సి-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లే క్రమంలో ఓటర్ స్లిప్‌తో పాటు ప్రభుత్వంచే జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును తీసుకొని వెళ్లేలా సూచించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాలెట్ పత్రాలను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తాము చేస్తున్న ఖర్చులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా తమపై నమోదైన కేసుల వివరాలను మూడుసార్లు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఉచితంగా ఓటర్ జాబితాను ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు జాబితా ప్రింటింగ్ ఖర్చులను అందించి రిటర్నింగ్ అధికారుల వద్ద ఓటర్ జాబితాలను పొందవచ్చున్నారు. 80 ఏండ్ల పైబడిన వృద్ధుల నుంచి 150 మంది వివిధ శాఖల్లో పని చేసే ఉద్యోగస్తులు పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం నమోదు చేసుకోవడం జరిగిందని.. దీనికి సంబంధించి అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వికారాబాద్, కొడంగల్, పరిగి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, విజయకుమారి, వివిధ విభాగాల నోడల్ అధికారులు కృష్ణన్, మల్లేశం, సుధారాణి, దీపారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, జడ్పీ డిప్యూటీ సీఈవో సుభాషిణి పాల్గొన్నారు.

### కనీస మద్దతు ధరకు వరి ధాన్యాన్ని సేకరించాలి

ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో వరి పంటకు కనీస మద్దతు ధరపై రూపొందించిన గోడ పత్రిక, కరపత్రాలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరణకు చర్యలు చేపట్టాలన్నారు. వానకాలం, ఖరీఫ్ సీజన్ ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2203, సాధారణ రకం రూ.2183 చొప్పున మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద కూలీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలోవ్యవసాయ అధికారి గోపాల్, పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు..

# బీఆర్‌ఎస్‌కే ముదిరాజ్‌ల మద్దతు

**కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్

కొడంగల్, నవంబర్ 16 : సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడుతూ ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నందుకు ముదిరాజ్ కులస్తులు, బీసీ సంఘాల తరపున ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. గురువారం కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కులస్తులను గౌరవించి.. ప్రత్యేక సంక్షేమ పథకాలతో పాటు కమ్యూనిటీ భవన నిర్మాణాలకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్న బీఆర్‌ఎస్‌కే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లను కేవలం ఓటు బ్యాంకులా మాత్రమే వాడుకొని అన్ని విధాలుగా నష్టానికి ఒడిగట్టినట్లు ఆరోపించారు. గతంలో ఏవిధంగా ఉండేదో.. ప్రస్తుతం ముదిరాజ్‌ల మనుగడ ఏవిధంగా ఉందో ఆలోచించుకోవాలని కోరారు. ముదిరాజ్‌లు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఘన విజయానికి పాటుపడాలని కోరారు. ముదిరాజ్‌ల మనుగడ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యపడుతుందన్నారు. ముదిరాజ్‌ల భవిష్యత్తును తీర్చిదిద్దుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ముదిరాజ్ సంఘం నాయకుల నినాదాలు

### మంచిరెడ్డికి మద్దతుగా తీర్మానం చేసిన కులపెద్దలు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 16 : రానున్న శాసనసభ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి తమ పూర్తి మద్దతు ఉంటుందని పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. ఈమేరకు గురువారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన ముదిరాజు మహాసభ తీర్మానించింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం పెద్దలు మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘం నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చగా.. ఆయన బాటలోనే ముదిరాజులంతా బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుదామన్నారు. రాష్ట్రంలో ముదిరాజులను గుర్తించింది కేసీఆర్ ప్రభుత్వమేనని, ముదిరాజ్ బిడ్డకు రాజ్యసభ స్థానం కల్పించి సముచితస్థానం కల్పించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముదిరాజులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకున్నారన్నారు. తెలంగాణలో 60లక్షల మంది ముదిరాజులున్నారని, తామంతా బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తామన్నారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలన్న లక్ష్యంతో తామంతా ముందుకెళతామన్నారు. శేరిగూడ సమీపంలో రూ.2కోట్లతో ఐదెకరాల్లో ముదిరాజులకోసం చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయించడానికి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి కృషిచేశారని పేర్కొన్నారు. మంచిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి ముదిరాజులంతా కలిసి రావాలన్నారు. త్వరలోనే నియోజకవర్గం మొత్తం పర్యటించి ముదిరాజులను సంఘటితం చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించడం కోసం కృషిచేస్తామని వారు తీర్మానించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ సహకారంతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, ముదిరాజుల కోసం పెద్దఎత్తున చేపపిల్లలను కూడా అందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు యాదయ్య, రాములు, చక్రపాణి, భిక్షపతి, రాజు, హనుమంతు, వేణుగోపాల్, వీరేశ్ పాల్గొన్నారు.

# వలపు వలకు చిక్కి విలవిల

**తీపి మాటలతో ఆకర్షించి.. నిలువునా దోచేసి..**

**న్యూడ్ ఫొటోలు.. వీడియోలు రికార్డు చేసిన యువతి**

వెంగళరావునగర్, నవంబర్ 16 : అందచందాలు.. కవ్వింపు మాటలతో ఆ యువకుడికి వలపు వల విసిరిందా యువతి. తీపి మాటలతో మత్తెక్కించి నిలువునా దోచేసింది. ఏకాంతంగా తీసుకున్న న్యూడ్ ఫొటోలు, వీడియోలతో బెదిరింపులకు పాల్పడి రూ.5 లక్షలు వసూలు చేసింది. పోలీసు కేసులతో భయపెట్టి మరింతగా డబ్బు గుంజే ప్రయత్నం చేసిందా మాయలేడి. హనీట్రాప్‌లో చిక్కుకొని విలవిలలాడిన ఆ యువకుడు చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు(25) ఎస్‌ఆర్‌నగర్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది కిందట కృష్ణానగర్‌లోని గది భాగస్వామ్యం కోసం ఓఎల్‌ఎక్స్‌లో ఓ ప్రకటనను పోస్ట్ చేశాడు. కవిత అనే మహిళ అతడిని సంప్రదించింది. రూమ్మేట్‌గా ఉంటానని చెప్పింది. అందమైన అమ్మాయి తన గదిలో భాగస్వామిగా ఉండబోతుందని పట్టరాని ఆనందంతో ఎగిరి గంతేశాడు. అందం.. అభినయంతో ఆ యువతి అతడిని కవ్వించింది. గదిలోనే కాదు.. గుండెలోనూ చోటిస్తానని ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. కొన్నాళ్లు గడిచిన తర్వాత ఆమె వ్యక్తిత్వం నచ్చక ఆ యువకుడు.. ఆమెను దూరంగా పెట్టసాగాడు. తన రూమ్‌లో నుంచి వెళ్లిపోవాలని చెప్పాడు. దీంతో ఆ యువతి అతడిపై కక్షగట్టింది. ఇద్దరూ కలిసి ఏకాంతంగా దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరింపులకు దిగింది. కోరిక తీర్చుకుని తనను మోసం చేశాడంటూ. ఆ యువకుడిపై పలు పోలీసుస్టేషన్లతో పాటు.. షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. షీ టీమ్స్ పోలీసులు వీరిద్దరికీ కౌన్సెలింగ్ చేశారు. పరిహారంగా రూ.4.70 లక్షలను ఆమెకు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత అతడి తల్లి ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసి.. మరింత డబ్బు డిమాండ్ చేసింది. ఈ నెల 13వ తేదీన వీరిద్దరూ మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్నారు. అమీర్‌పేటలోని సారథి స్టూడియోలో కలుసుకున్నారు. ఆ సమయంలో యాక్టివా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడిపై దాడి చేశారు. ఆ యువతి కూడా రాయితో తలపై దాడి చేసింది. బాధితుడిని చికిత్స నిమిత్తం పోలీసులు అమీర్‌పేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.ఉదయ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# కూతురిపై లైంగిక దాడి

**25 ఏండ్ల జైలు శిక్ష..**

**5వేల జరిమానా.. బాధిత బాలికకు**

**5 లక్షల నష్టపరిహారం**

నాంపల్లి కోర్టులు, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడిన షేక్ రిజ్వాన్ (35)కు 25 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని పోక్సో ప్రత్యేక కోర్టు, 12వ అదనపు జిల్లా జడ్జి టి.అనిత గురువారం సంచలన తీర్పు వెల్లడించారు. అదే విధంగా.. బాధిత బాలికకు 5 లక్షల నష్టపరిహారాన్ని అందించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాంరెడ్డి కథనం ప్రకారం.. 2022లో కూతురిపై జరిగిన లైంగిక దాడిపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, ఆ తర్వాత దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణ చేపట్టింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో కోర్టు తీర్పును ప్రకటించింది.

# ఎగ్జిట్ పోల్ సర్వే చేస్తున్న ఆరుగురు అరెస్టు

వెంగళరావునగర్, నవంబర్ 16 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటెవరికి వేస్తారని ఓటర్లను అడిగి ఎగ్జిట్ పోల్ సర్వే చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓటర్ల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న స్మార్ట్ పొలిటికల్ ఎగ్జిట్ పోల్ సంస్థకు చెందిన ఉద్యోగులు విజయ్‌కుమార్, ఎన్‌వీఎన్‌ఎస్. మనోజ్, జితేందర్ కుమార్, జాకీర్ హుస్సేన్, లింగయ్య, వెంకట్‌ను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి మూడు డబ్బాలు, 300 సర్వే కాపీలను స్వాధీనం చేసుకున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు, నోటాలో ఎవరికి ఓటేస్తారని ఓటర్ల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఇలా సర్వే చేయడం నిషేధమని, చట్ట విరుద్ధంగా సర్వే చేస్తున్న వీరిపై జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అభిషేక్ తివారీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

**ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ప్రక్రియ**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 16 : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా గురువారం పోలింగ్ సిబ్బంది రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు, ఐఏఎస్‌లు చంద్రకాంత్ కృష్ణారావు డాంగే, ననిమ, రాంకుమార్, శిల్పగుప్తా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ సమక్షంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడుతలుగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు పరిశీలకుల దృష్టికి భారతి హోలీకేరీ తీసుకెళ్లారు.

జిల్లాలో 3,369 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. పోలింగ్ విధుల కోసం సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ చెప్పారు. 20 శాతం రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఇతర పోలింగ్ సిబ్బంది ఉంటారన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. సమావేశంలో పరిశ్రమలశాఖ అధికారి, మ్యాన్ పవర్ నోడల్ అధికారి రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎన్నికల సాధారణ పరిశీలకులు, కలెక్టర్ భారతి హోలీకేరీ తదితరులు